క్లుప్తంగా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎంపీడీఓ అనుపమ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకుంటూ స్వయంశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. మహిళా దినోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలతో హ్యాపీ ఉమెన్, వెల్దీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని మహిళలను చైతన్య పరచి, పురోభివృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సీడీపీఓ వై.లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా, సంతోషంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ ఫుడ్ గురించి వివరించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.రాజేశ్వరి, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయవద్దు



గొడ్డటిపాలెంలో తడి, పొడి చెత్త విడిగా ఇవ్వాలని మహిళకు సూచిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లోని వీధులలో, రోడ్లపైన చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండలం గొడ్డటిపాలెం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అందుకు గృహస్తులందరూ తడి, పొడి చెత్తను విడివిడిగా డస్ట్‌బిన్‌లలో వేసి ఉంచాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు వాటిని అందజేయాలన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా ఉంటాయన్నారు. తడి, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించి, అక్కడ వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని, రైతులకు తక్కువ ధరకే కాంపోస్ట్ ఎరువు లభ్యమవుతుందని ఈఓపీఆర్డీ సూచించారు. అనంతరం ఆయన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి వెళ్లి దాని నిర్వహణను పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. గ్రామ కార్యదర్శి పి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

తార్కిక ఆలోచనలను ప్రోత్సహించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



బహుమతులు అందజేస్తున్న డీఈఓ పిల్లి రమేష్

బాలాజీచెరువు: విద్యార్థుల్లో తార్కిక ఆలోచనలను ప్రోత్సహించి వారిలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ పేర్కొన్నారు. స్థానిక పైండా సత్తిరాజు పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా భావి శాస్త్రవేత్తలను ప్రోత్సహించవచ్చని, నేటి బాలలే రేపటి పౌరులన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి పాఠశాల స్థాయి నుంచి సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సైన్స్, క్విజ్, పోస్టర్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినీల్, బాలల సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.సుబ్బలక్ష్మి, చింతా నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 12 మంది గైర్హాజరు

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

మంగళవారం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిషు పేపర్–1 పరీక్షను 102 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 90 మంది హాజరుకాగా, 12 మంది గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు తెలిపారు.

గీత దాటితే బాదుడే



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న రవాణాశాఖాధికారులు



రహదారిపై స్పీడ్ గన్‌తో వాహన వేగాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

- నిబంధనల అతిక్రమణపై రవాణాశాఖ సీరియస్
- ఈ–చలానా జోరు పెంచిన అధికారులు
- ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి
- రెండోసారి పట్టుబడితే రూ.10 వేల ఫైన్

బాలాజీచెరువు: రహదారిపై మేం స్పీడ్‌గా వెళుతున్నాం. మమల్ని ఎవరూ పట్టించుకోలేదు. మద్యం తాగి వెళుతున్నా మమల్ని ఎవరూ ఆపలేదు అనుకుంటున్నారా? ఆగండాగండి.. అలా అనుకుంటే వాహనచోదకులు పప్పులో కాలేసినట్టే. వాహనాన్ని ఆపి తనిఖీ చేసి కేసులు రాసే రోజులు పోయాయి. తాజాగా నిబంధనలు అతిక్రమించి వెళుతున్న వాహనాల ఫొటోలు తీసి నేరుగా వాహనదారు ఇంటికి జరిమానా విధిస్తున్నట్టు చలానాలు పంపించే రోజులు వచ్చాయి.

ప్రధానంగా వాహన చోదకులు నిబంధనలు అతిక్రమించడం వల్లే రహదారులపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు రవాణా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బ్రీత్ ఎనలైజర్‌తో పాటు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలో ఏదో ఒక ప్రాంతంలో మద్యం తాగి పట్టుబడుతున్న వాహనాచోదకులు అధిక సంఖ్యలో ఉంటున్నారు.

అదే విధంగా జాతీయ రహదారిపై ఎంత పోవాలనే దానిపై బోర్డులతో పాటు హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఎక్కువ వేగంగా వెళ్లినట్లయితే స్పీడ్ లేజర్ గన్‌లో వాహన వేగం నమోదై వాహనం నంబర్ ఆధారంగా యాజమాని చిరునామా వివరాలు తెలుస్తాయి.

ఇంటికే ఈ–చలానా..

నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల ఇళ్లకు ఈ–చలనాలు పంపిస్తున్నారు. చిరునామా ఆధారంగా జరిమానా విధించి వారంలో చెల్లించాలని పేర్కొంటున్నారు. అయితే సెల్‌ఫోన్లలో ఈ–చలానా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నెంబర్ టైప్ చేసినా ఫైన్ వివరాలు తెలుస్తాయి. చాలా మందికి ఈ–చలానాపై అవగాహన లేకపోవడం వల్ల వేల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. ట్యాక్స్ చెల్లింపు, రీ రిజిస్ట్రేషన్, పర్మిట్, తదితర సమయాల్లో ఈ–ఫైన్‌ల వివరాలు బయట పడతాయి. ఫైన్ చెల్లిస్తేనే ఆ లావాదేవీ ముందుకు వెళ్తుంది. ఒక సారి జరిమానా పడిన వాహనానికి మళ్లీ అదే తప్పు చేసిన్నట్లయితే రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు.

లక్షల్లో కేసులు..

నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై రవాణాశాఖ అధికారులు లక్షల్లో అపరాధ రుసుము వసూలు చేస్తున్నారు. జరిమానాల వివరాలు పరిశీలిస్తే..

సంవత్సరం	కేసులు	అపరాధ రుసుము
2021–22 (ఉమ్మడి జిల్లా)	85,381	13,83,34,900
2022–23	92,291	18,80,80,000
ఓవర్ స్పీడ్. (స్పీడ్ గన్)తో		
2021–22	10,969	2,37,18,500
2022–23	8756	2,24,10,500

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రతి వాహనదారుడు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. ప్రతి రోజూ తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల ఇళ్లకు చలానాలు పంపిస్తున్నాము. ఒక సారి ఫైన్ పడిన వాహనం రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తాం. ఈ చలానాల స్పీడ్ పెంచుతున్నాం. అందరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి.

– కె.శ్రీధర్,
జిల్లా రవాణాశాఖాధికారి,
కాకినాడ

ఆహార నియమాలతో ఊబకాయానికి చెక్



ఒబేసిటీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: ఊబకాయం ఒక మహమ్మారి అని, దాని కారణాలు, నివారణ వ్యూహాల గురించి అవగాహన పెంచడానికి ఏటా మార్చి 4న వరల్డ్ ఒబేసిటీ డే నిర్వహిస్తున్నట్టు వైద్య నిపుణులు డాక్టర్ వసంతకుమార్ తెలిపారు. రోజు రోజుకీ పెరుగుతున్న ఊబకాయుల ఆహారంలో మార్పులు చోటుచేసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం ఇందుకు కారణమన్నారు. శారీరక శ్రమ తగ్గడం, జన్యుపరంగా హార్మోన్ల ప్రభావం వల్ల చిన్న వయసులోనే చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారని చెప్పారు. ఊబకాయం వల్ల దాదాపు ప్రతి అవయవం ప్రభావితమవుతోందన్నారు. పొత్తికడుపులో పేరుకుపోయిన కొవ్వు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఇన్సులిన్ సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తోందన్నారు. దీని వల్ల మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంన్నారు. ఊబకాయం ఉన్న పెద్దలకు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఆరోగ్యకరమైన పరిమాణంలో ఉన్నవారి కంటే 7 రెట్లు ఎక్కువ అని వసంత కుమార్ తెలిపారు. డయాబెటిస్‌ను సరిగ్గా నియంత్రించకపోతే అది నరాలు, మూత్రపిండాలు, కళ్లు, గుండెను దెబ్బతీస్తుందన్నారు.. ఊబకాయం ఉన్నవారిలో ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ ప్రమాదం మూడు రెట్లు ఎక్కువన్నారు. డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని ఎంచుకోవడం, బంగాళాదుంపలు, స్వీట్లు, ఎర్ర మాంసం, ప్రాసెస్ చేసిన మాంసం వంటి అనారోగ్యకరమైన ఆహారాలను పరిమితం చేయాలన్నారు. అనారోగ్యకరమైన పానీయాలు తగ్గించాలన్నారు. స్క్రీన్ సమయం, ఇతర ×కూర్చునే సమయాన్ని× పరిమితం చేయడం ద్వారా నిశ్చల జీవనశైలి, శారీరక శ్రమను నివారించడం ద్వారా సాధ్యమైనంత వరకు ఊబకాయ సమస్యలను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభకర రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ రామ్ పాల్గొన్నారు.

ఆపత్కాలంలో రక్షణ 112



విద్యార్థినులకు పోలీసుల పనితీరును, చట్టాలను వివరిస్తున్న ఎస్‌ఐ సునీత

కరప: ఎప్పుడైనా, ఎక్కడైనా అనుకోకుండా ఆపదలో చిక్కుకున్నా, ఎవరైనా ఆకతాయి వేధింపులకు పాల్పడుదున్నా వెంటనే 112కు కాల్‌చేస్తే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని ఎస్‌ఐ టి.సునీత తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సునీత మాట్లాడుతూ మహిళల భద్రతకు అమలులో ఉన్న చట్టాలను వివరించారు. పోలీసుస్టేషన్ పనితీరును, ఆపద సమయంలో 112కు ఎలా ఫోన్ చేయాలో వివరించి, కాల్ చేయగానే పోలీసులు వచ్చి సమస్య నుంచి త్వరితగతిన కాపాడతారని ఎస్‌ఐ వివరించారు. విద్యార్థినులకు పోలీసుస్టేషన్ పూర్తిగా చూపించి, ఎవరు ఎలా పనిచేస్తారో తెలిపి, అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐలు వి.సూరిబాబు, శ్రీనివాస్, సురేష్, మునాఫ్, లోవరాజు తదితరలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన దిశగా చర్యలు

- కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి
- జేఎన్‌టీయూకే ఐఐఐ పీటీ డైరెక్టర్ బత్తుల



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐఐ పీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐ పీటీ (ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్లేస్‌మెంట్ ట్రెనింగ్) డైరెక్టర్ బత్తుల తిరుమల కృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇంటర్న్‌షిప్ పోగ్రాం తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రతి నెలా రెండు నుంచి మూడు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేలా కంపెనీ ప్రతినిధులతో సంప్రదించి ఏర్పాటు చేస్తున్నామన్నారు. బెంగళూరుకు చెందిన ఎడ్యుటెక్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంబీఏ విభాగానికి చెందిన 40 మంది విద్యార్థులకు 13 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.5 లక్షల వేతనం ఉంటుందని తెలియజేశారు. సాయి పవర్ ఎక్విప్‌మెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ సాయిపవార్, గోపిలు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగ అధ్యాపకులు మీసాల మధు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సైన్స్ క్విజ్‌లో కాండ్రకోట విద్యార్థి ప్రతిభ



బహుమతులతో వెంకటరమణ

పెద్దాపురం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాకినాడలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో మండలంలోని కాండ్రకోట హైస్కూల్ విద్యార్థి తన ప్రతిభ కనపర్చాడు. ఈ మేరకు మంగళవారం కాకినాడలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో పాఠశాలకు చెందిన నీలం వెంకటరమణ (8వ తరగతి) ప్రతిభ కనపర్చి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చాడు. వెంకటరమణను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ఉదయ్‌పూర్‌లో రైఫిల్ షూటర్ మృతి

గొల్లప్రోలు... గొర్రిపూడిలో విషాదఛాయలు



గండి సత్యనారాయణ (ఫైల్)

కరప: మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన రైఫిల్ షూటింగ్ క్రీడాకారుడు గండి సత్యనారాయణ (19) రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో మృతి చెందిన విషయం ఆలస్యంగా తెలిసింది. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు 2023 సంవత్సరం జనవరి నెలలో కేంద్రప్రభుత్వం సన్సద్ ఖేల్ స్పర్ధ క్రీడా పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో క్రాస్ బౌ రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్రం నుంచి గొర్రిపూడికి చెందిన అన్నదమ్ములు గండి కార్తికేయ, గండి సత్యనారాయణ పాల్గొనగా అండర్–20 విభాగంలో సత్యనారాయణ (585/600) పాయింట్లు సాధించి ప్రథమస్థానంలో నిలచి బంగారు పతకం సాధించాడు. కాగా ప్రస్తుతం సత్యనారాయణ రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో ట్రిపుల్ ఐటీ చదువుతున్నాడు. సత్యనారాయణ తన స్నేహితులతో కలసి ఈ నెల 2వ తేదీన అక్కడి కాలువలోకి స్నానానికి వెళ్లి, ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని తండ్రి శివకుమార్, ఇతర బంధువులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి, బంధువులు రాజస్థాన్‌కు బయలుదేరి వెళ్లారు. జాతీయ స్థాయి పోటీలలో రాణించి, బంగారుపతకం సాధించి, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు సాధించిన సత్యనారాయణ మరణవార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆస్తులు అన్యాక్రాంతమై..



గోర్సలో పురాతన సీతారామస్వామి ఆలయం

- శిథిలావస్థకు చేరిన సీతారామ ఆలయం
- ఆక్రమణలో 30.96 ఎకరాల ఆలయ పంట భూమి
- ధూప దీప నైవేద్యాలకు భారం
- ప్రభుత్వ భృతితోనే ప్రసాదాలు
- పోరాడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



గోర్సలో అక్రమణకు గురైన ఆలయ భూమి

కొత్తపల్లి: శతాబ్దాలుగా ప్రసిద్ధి గాంచిన సీతారాముల ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఆక్రమణ చెరలో చిక్కుకోవడంతో ఆలయంలో ధూప, దీప, నైవేద్యాలు చేయడం భారమయ్యాయి. ఆలయ అర్చకుడుకి ప్రభుత్వం అందించే భృతితోనే దేవుడికి ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. దేవాలయ బాగోగులు కోసం రాజులు కేటాయించిన భూమి నేడు పరుల చేతుల్లో ఉండడంతో దాతల సహకారంతోనే ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామా ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఆ ఆలయాన్ని పిఠాపురం మహారాజు హయాంలో నిర్మించారు. ఆలయానికి సంబంధించి ధూప దీప నైవేద్యాల కోసం గోర్సలో 14శతాబ్దంలో సర్వే నంబర్ 121, 122లో 19.92, కుతుకుడుమిల్లిలో సేర్వే నంబర్ 142/1లో 4.89 ఎకరాలు, 142/2లో 6.25 ఎకరాలను కేటాయించారు. గోర్స ఉన్న 19.92 ఎకరాలను స్థానికంగా ఉన్న కండేపల్లి నాగన్న, అప్పన్నలకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని ఆలయానికి ధూప దీప నైవేద్యాలకు ఇచ్చేలా ఏర్పాటు చేశారు. అయితే రాను రాను కొతకాలం తరువాత వారు ఆ భూమిని ఆక్రమించి అన్యాక్రాంతానికి పాల్పడ్డారు. అప్పటి దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకకోవడంతో ఆ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో కొంత మంది రైతులు ఆక్రమించుకున్నారు. అప్పటి నుంచి ఈ భూమిపై 1962లో నుంచి భూమి కోసం పోరాటానికి దిగారు. హైకోర్టును సైతం ఆశ్రయించారు. పలు మార్లు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడమే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. 2013లో గ్రామస్తులు సహకారంతో దేవదాయ శాఖ ఎండోమెంటు ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి భూమి కోసం హిందూ ధర్మ రక్షణా సమితి సభ్యులు కూడా పోరాటానికి సిద్ధమయ్యారు.

భూముల వివరాలివీ..

గోర్సలో సర్వే నంబర్ 121, 122లో 19.92 ఎకరాలు, కుతుకుడుమిల్లిలో సర్వే నంబరు 142 /1 4.89 ఎకరాలు, 142/2లో 6.25 ఎకరాల భూమి ఉంది.

ప్రభుత్వం అందించే రూ.15వేల భృతితో ఆలయ అర్చకులు పోషణ, ఆలయ ధూప దీప నైవేద్యాలను అందిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి

ఈ భూములకు సంబంధించి 30.96 ఎకరాల భూమి ఆక్రమణదారుల అన్యాక్రాంతంలో ఉంది. భూములపై దేవదాయ శాఖ కోర్టును ఆశ్రయించింది.

శరీరంలో కొవ్వును నియంత్రించాలి

బోట్‌క్లబ్: శరీరంలో కొవ్వు పెరగకుండా చూసుకోవాలని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ భీమాల దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ స్థూలకాయ దినోత్సవం సందర్భంగా స్థానిక డైట్ ఆస్పత్రిలో మంగళవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఊబకాయం కేవలం సౌందర్య సమస్య మాత్రమే కాదన్నారు. ఇది వివిధ రకాల ఆరోగ్య సమస్యలను పెంచే ప్రమాదంతో నేరుగా ముడిపడి ఉంటుందన్నారు. ఊబకాయం మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. మంచి సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో భీమాల దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలపై అవగాహన సదస్సులు



కార్యక్రమంలో చెక్కు విడుదల చేస్తున్న యూనియన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయ జీఎం జీఎస్‌వీ రమణ తదితరులు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం యూనియన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయ జనరల్ మేనేజర్ జీఎస్‌వీ రమణ, విశాఖపట్నం ఫీల్డ్ జనరల్ మేనేజర్ షాలిని మీనన్ మెగా ఎంఎస్‌ఎంఈ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు మెగా ఎంఎస్‌ఎంఈ అవగాహన ప్రచారాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ప్రధాన ఎంఎస్‌ఎంఈ రుణాలైన ఎంఎస్‌ఎంఈ సూపర్ ఫాస్ట్, యువ శక్తి, యూనియన్ నారీశక్తి, ఇతర ప్రభుత్వ పథకాలు, ఆర్థిక అక్షరాస్యత వంటి వాటిని వక్తలు సభికులకు వివరించారు. రీజినల్ హెడ్ సాయి మనోహర్ కాకి, డెప్యూటీ రీజినల్ హెడ్ నారాయణ, యూనియన్ బ్యాంక్ వివిధ బ్రాంచి మేనేజర్లు, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఐసీ జీఎం గణపతి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం



ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

కరప: మండలం సిరిపురం గ్రామంలో షిరిడిసాయిబాబా మందిరం 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సిరిపురం, పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, బాబాను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. 3 వేల మంది మహిళలతో ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపించి గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 10 వేల మందికి ప్రసాద వితరణ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్ హెచ్‌పీ బంక్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించినట్టు ఎస్‌ఐ వి.మౌనిక తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆ వ్యక్తికి సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94409 04846 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫలసాయం వేలం పాట వాయిదా

కొత్తపల్లి: వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకంలో ఉన్న ఫలసాయం వేలం పాటను వాయిదా వేసినట్టు జిల్లా పరిషత్ రెవెన్యూ ఆఫీసర్ కే శ్రీనివాస్ తెలిపారు. నాగులాపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రక్షిత మంచినీటి పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లకు వేలం పాట నిర్వహించారు. అయితే సంవత్సరానికి నిర్ణయించిన కనిష్ట ధర రూ.44 వేలు కావడంతో పాట పాడుకునేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. దీంతో పాటను వాయిదా వేస్తున్నట్టు శ్రీనివాస్ తెలిపారు.